క్లుప్తంగా

పార్వతీపురం కోర్టు ఏజీపీకి అదనపు బాధ్యతలు


బి.సత్యనారాయణ

సీతానగరం: పార్వతీపురం కోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్) బొంగు సత్యనారాయణకు అదనంగా బొబ్బిలి కోర్టు సివిల్ కేసుల బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసినట్లు ఆయన శనివారం తెలిపారు. ప్రస్తుతం తాను బొబ్బిలి కోర్టు ఏజీపీగా బాధ్యతలు స్వీకరించానని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు ఇక్కడే విధులు నిర్వహిస్తానన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటి వద్దకే వైద్యసేవలు


వైద్య తనిఖీల అనంతరం ప్రిస్క్రిప్షన్ రాసి ఇస్తున్న వైద్యురాలు పావని

సీతానగరం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు పావని అన్నారు. మండలంలోని సూరంపేట సచివాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన పలువురు గ్రామస్తులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. మెరుగైన ఆరోగ్యానికి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాంబన్న దొర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం


కార్యక్రమానికి హాజరైన భక్తులు

మక్కువ: మండలంలోని బంగారువలస గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కోన, గోపాలపురం, బంగారువలస, నగుళ్ల గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరై, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అంతకు ముందు వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శంబంగి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి


లబ్ధిదారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సీతానగరం: జగనన్న కాలనీల్లో చేపడుతున్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం.ఎల్.ఎన్.ప్రసాద్ సూచించారు. మండలంలోని పెదబోగిలి సచివాలయం-2 పరిధిలోని అప్పయ్యపేటలో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి, నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నిర్మాణాలు చేస్తున్న వారికి సకాలంలో బిల్లులు, నిర్మాణ సామగ్రి, రుణం కూడా ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బి.కుసుమ, సచివాలయ కన్వీనర్ బి.సూర్యనారాయణ, గృహనిర్మాణ శాఖ ఏఈ జానకీరాం, ఈవోపీఆర్డీ కె.కుమారవర్మ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే కాలుష్య నివారణ


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: అవగాహనతోనే కాలుష్య నివారణ సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. ప్రపంచ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా రసాయన శాస్త్ర విభాగం నేతృత్వంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలో విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి. జయమణి, ఉపన్యాసకులు బి.రాజు, శ్రీనివాసరావు, జగన్ మోహనరావు, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

రైలుబస్సు పునరుద్ధరించాలి

- డిప్యూటీ సీఎం రాజన్నదొరను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు


డిప్యూటీ సీఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సాలూరు: సాలూరు-బొబ్బిలి రైలుబస్సు పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్, అనిల్‌కుమార్, రామకృష్ణ, తవిటినాయుడు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక పట్టణంలో డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొరను ఆయన నివాసంలోనే శనివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. అనంతరం రైలుబస్సు నడపడం ద్వారా ఇరుప్రాంతాలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే ప్రస్తుతం కొత్తగా విశాఖపట్నం నుంచి సాలూరుకు నడపాలనుకుంటున్న రైలు ప్రయాణాల్లో కూడా స్వల్ప మార్పులు తీసుకోవాలని విన్నవించారు. వేకువజామున 4 గంటలకు విశాఖపట్నానికి సదరు రైలు నడపడం ద్వారా ఈ ప్రాంత ప్రజలు ఆ రైలు సేవలను సద్వినియోగం చేసుకోలేకపోవచ్చని, ప్రజల ప్రయాణానికి అనువైన సమయంలో రైలు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాలూరు-దండిగాం రోడ్డు సమీపంలోని రైల్వేలైన్ వరకు రైలు వచ్చేలా చొరవ తీసుకోవాలని వినతించారు. సమస్య పరిష్కారానికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు సదరు నేతలు తెలిపారు.

అటవీ శాఖ అనుమతులు..

అంతకుముందు విలేకరులతో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ శుక్రవారం తనను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎఫ్‌వో ప్రసూన దృష్టికి గిరిశిఖర గ్రామాల రోడ్ల కష్టాలు వివరించానన్నారు. గిరిశిఖర గ్రామాల్లో రోడ్లు వేసేందుకు అనుమతులు మంజూరు చేయాలని కోరిన వెంటనే మానవతా హృదయంతో స్పందించి, అటవీ శాఖ అనుమతులు మంజూరు చేసిందని, ఈ మేరకు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల డీఎఫ్‌వోలకు గిరిజనుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపానన్నారు. మండలంలోని దిగువశెంబి నుంచి డిప్పలపాడు మీదుగా తోణాం రోడ్డు, రొడ్డవలస జంక్షన్ నుంచి కంకణాపల్లి రోడ్డులకు అటవీ శాఖ అనుమతులు వచ్చాయన్నారు.

100 శాతం నిర్మాణాలు..

ఇదిలా ఉండగా, శనివారం ఆయనను కలిసిన మున్సిపల్ కమిషనర్ జయరాం, హౌసింగ్ డీఈ సోమేశ్వరరావు, ఏఈ శ్రీనివాసరావులకు డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీ గృహ నిర్మాణాలను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన 2024 జనవరి 31వ తేదీలోగా 100 శాతం నిర్మాణాలు పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దండి

- ఐటీడీఏ పీవో విష్ణుచరణ్


విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ సూచించారు. శనివారం మండలంలోని కొత్తవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ఆయన పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలని సిబ్బందికి తెలిపారు. పాఠశాల ఆవరణలో ఇంకుడుగుంతలు నిర్మించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరిచేందుకు నిధులు మంజూరు చేస్తామన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహనకు ప్రత్యేక చర్యలు

- ఐటీడీఏ పీవో విష్ణుచరణ్


ఈవీఎం పనితీరుపై ఆరాతీస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు: గిరిశిఖర గ్రామాల్లో ఓటుహక్కు నమోదు, వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ తెలిపారు. శనివారం మండలంలోని కొత్తవలస గ్రామ పోలింగ్ బూత్ కేంద్రం వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంను పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈవీఎంల పనితీరు, ఫారం 6, 7, 8లపై ఆరాతీశారు. 8 ఈవీఎంల ద్వారా ఇక్కడి వారికి ఓటు ఎలా వినియోగించుకోవడం అన్నదానిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ ప్రక్రియ 2024 జనవరి చివరి వరకు కొనసాగుతుందన్నారు. ఆసక్తి ఉన్న ఓటర్లు పోలింగ్ బూత్ కేంద్రాల వద్దకు వచ్చి, ఈవీఎంల ద్వారా ఓటు వినియోగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులంతా ఓటుహక్కు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ భానుప్రసాద్, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్

సాలూరు: మహిళా మార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ కోరారు. శనివారం స్థానిక పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సాలూరు, పాచిపెంట మండలాల వెలుగు ఏపీఎంలు, సీసీలు, వీవోఏలతో సమావేశమైన ఆయన ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా సంఘాల సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాల ద్వారా చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని, ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళా మార్ట్‌లలో కూడా నాణ్యమైన సరుకులు లభ్యమవుతున్నాయన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు సింహాచలం, జయకుమార్, డీఆర్‌పీ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' ట్రోఫీల ఆవిష్కరణ


ఆడుదాం ఆంధ్రా పోటీల ట్రోఫీలతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: గ్రామీణ యువతలోని క్రీడానైపుణ్యాలు వెలికితీయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాం కార్యక్రమం పేరిట క్రీడాపోటీలు నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. శనివారం స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు కలిసి, డిప్యూటీ సీఎంతో ఆడుదాం ఆంధ్రా ట్రోఫీలు, బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పలు క్రీడాంశాల్లో అన్ని విభాగాల్లో పోటీలు జరుగుతాయని, 15 ఏళ్ల వయసు నిండిన వారంతా పోటీలకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి గానీ, సచివాలయాల వద్ద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి గానీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎంపీడీవో పార్వతి తదితరులు పాల్గొన్నారు.

200 లీటర్ల సారా స్వాధీనం


స్వాధీనం చేసుకున్న సారాకేన్లను చూపిస్తున్న ఎస్ఐ ఫక్రుద్దీన్

పాచిపెంట: కారులో అక్రమంగా తరలిస్తున్న 220 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. శనివారం ఉదయం ఒడిశా నుంచి చాపరాయవలస గ్రామానికి వస్తున్న కారులో గ్రామం వద్దనే ఆకస్మిక తనిఖీలు చేసి, 11 కేన్లలో తరలిస్తున్న సారాను గుర్తించి, స్వాధీనం చేసుకున్నామన్నారు.

చిన్నారులను పనిలో పెడితే చర్యలు


తనిఖీలు చేపడుతున్న అధికారులు

సీతంపేట: పెద్దనిమిదేళ్ల లోపున్న బాల, బాలికలను పనిలో పెడితే సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేస్తామని అసిస్టెంట్ లేబర్ ఇన్‌స్పెక్టర్ ఆర్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. ఆపరేషన్ స్వేచ్ఛ ప్రోగ్రాం-4లో భాగంగా సీతంపేటలో వివిధ హోటళ్లు, దుకాణాల్లో శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల యజమానులకు కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిశ ఎస్సై లావణ్య, ఏఎస్సై బి.సంజీవ్, జూనియర్ అసిస్టెంట్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి


సీడీపీఓకు గ్లాసులు, ప్లేట్లు అందిస్తున్న సూర్యనారాయణ

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు మెరుగైన సేవలు అందించాలని సీడీపీఓ సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని ఎన్‌కే రాజపురంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, మెనూ వివరాలపై ఆరా తీశా రు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం అదే ప్రాంతానికి చెందిన కోరాడ సూర్యనారాయణ అందించిన స్టీల్ గ్లాసులు, ప్లేట్లను చిన్నారుల కు అందజేశారు.కార్యక్రమంలో ఐసీడీఎస్ సూ పర్‌వైజర్ టి.మేరి, సిబ్బంది ఎల్.జయమ్మ, అప్పలరాములమ్మ పాల్గొన్నారు.

చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు


ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శనలో ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సాలూరు: చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ అన్నారు. శనివారం మండలంలోని పెదపథం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారన్న విషయంపై ఆరాతీశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే లారీలు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. తుపాను నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేయాలని, ధాన్యం తడిసిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట ఏవో అనూరాధ పండా తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో కవలల జననం


అంబులెన్స్‌లో జన్మించిన కవల పిల్లలు

భామిని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 108 అంబులెన్స్‌లు ప్రమాద సమయంలోనూ, ప్రసవాల సమయంలోనూ ఆదుకుంటున్నాయి. మండలంలోని పోలవరంనకు చెందిన గర్భిణి నిమ్మల లతకు శనివారం పురిటినొప్పులు రాగా.. కుటుంబ సభ్యులు సీతంపేట ఐటీడీఏ కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కొత్తూరు సీహెచ్‌ఎన్‌సీలో అందుబాటులో ఉన్న 108 అంబులెన్స్ పోలవరం వచ్చి గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా.. నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ప్రసవం జరిపించగా కవల పిల్లలు పుట్టారు. వెంటనే తల్లీబిడ్డలను కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోండి



పాలకొండ:ర్యాలీలో పాల్గొన్న పీఓ కల్పనాకుమారి, తదితరులు

పాలకొండ: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. ఓటుహక్కు వినియోగంపై పట్టణంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, బీఎల్‌ఓలు పాల్గొని ఓటే వజ్రాయుధమని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ఓటరు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అర్హులందరూ ఓటు హక్కు పొందాలి..

గుమ్మలక్ష్మీపురం: అర్హులంతా తప్పనిసరిగా ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. మండలంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను శనివారం ఆమె పరిశీలించారు. లక్కగూడ పోలింగ్ కేంద్రం వద్ద ఆమె మాట్లాడుతూ, 18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఓటుహక్కు కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.ఎస్ చైతన్య స్రవంతి ఎల్విన్‌పేటలోని 76, 77 పోలింగ్ స్టేషన్లను సందర్శించి, ఓటర్ల జాబితాలను పరిశీలించారు.

ప్రత్యేక ఓటర్ల నమోదు పరిశీలన

భామిని: మండలంలోని 42 పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలను ఎస్‌ఓలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలో ఆదివారం కూడా ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పీఓ కల్పనాకుమారి ఆదేశాల మేరకు ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల దరఖాస్తు పరిశీలన కూడా కొనసాగుతుందన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: స్థానిక పట్టణంలోని బెలగాం 20, 21వ వార్డుల పరిధిలోని చర్చి సెంటర్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అభివృద్ధి పనులను ఒక్కొక్కటిగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రూ.70 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించి, త్వరితగతిన పనులు పూర్తి చేస్తామన్నారు. పార్వతీపురం నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరీ, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ


పిల్లల బరువు చార్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీఓ జి.పైడితల్లి అన్నారు. మండలంలోని రావుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, శిశువులు, కిశోర బాలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పౌష్టికాహారంపై తల్లులకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్'


తాలాడ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరి

భామిని: మండలంలోని తాలాడ, ఘనసరలలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలను శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలు అందని కొంతమంది అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సవర నాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎరుకుమజ్జి పాపినాయుడు, బీజేపీ నాయకుడు కె.తిరుపతిరావు, అధికారులు పాల్గొన్నారు.

తమ్మయ్యవలసలో పూరిల్లు దగ్ధం


తమ్మయ్యవలసలో బాధితురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని తమ్మయ్యవలస గ్రామంలో శుక్రవారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో నిమ్మకాయల అంకమ్మకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్‌లీకై ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. సర్వం కాలిబూడిద కావడంతో బాధితురాలు కన్నీరుమున్నీరవుతోంది. సర్పంచ్ శనపతి రాంబాబు ఇచ్చిన సమాచారం మేరకు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు బాధితురాలిని శనివారం పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం అందేలా చూడాలని తహసీల్దార్ రత్నకుమార్, హెచ్‌డీటీ భాస్కరరావుకు సూచించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, డి.గదబవలస ఎంపీటీసీ గిరి, పణుకువలస సర్పంచ్ సత్యనారాయణ ఉన్నారు.